క్లుప్తంగా

క్రీడల్లో సత్తా చాటాలి



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందించిన దాతలు

కృష్ణగిరి: విద్యార్థులు చదవుతోపాటు క్రీడల్లో సత్తాచాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డోన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని కంబాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడాదుస్తులు, పరికరాలను దాత శివశంకర్‌గౌడ్, పీడీ సుధాకర్‌తో కలిసి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్షమశిక్షణ నైపుణ్యంతో రాణిస్తే విజయం సొంతమవుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో బాల బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అథ్లెటిక్స్ సంబంధించి రూ.10 వేలు విలువైన సామగ్రి, 30 జతల క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనాథ్, పీఈటీ లక్ష్మయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, అంజనేయులు శెట్టి, క్లబ్ సభ్యులు లక్ష్మిరెడ్డి, కృష్ణ, బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌లో చిక్కుకున్న వేర్లు



పైపు నుంచి బయటకు తీసిన చెట్టు వేర్లు

హొళగుంద: స్థానిక సినిమా లైన్‌లోని ఓ వీధికి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌లో దాదాపు 15 అడుగుల మేర చెట్టు వేర్లు బయటపడ్డాయి. సదరు వీధిలోని కొన్ని ఇళ్లకు కొద్ది నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమస్య ఎక్కడ ఉందో తెలియక చాలా రోజులుగా నీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కార్మికులతో మంగళవారం పైపు మొత్తం తొలగించి చూడగా 15 అడుగులకు పైగా చెట్టు వేర్లు అడ్డంగా పేరుకుపోయాయి. వాటిని తొలగించడంతో తాగు నీటి సరఫరా యథావిధిగా కొనసాగింది. సమస్య పరిష్కరించిన పంచాయతీ సిబ్బందికి ఆ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రాపవుట్లు లేకుండా చర్యలు



సీఆర్పీలకు సూచనలిస్తున్న ఏపీసీ వేణుగోపాల్

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో చదువుతూ బడిమానేసిన పిల్లలను గుర్తించి వారి చదువులు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ సీఆర్‌పీలకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీలతో సమావేశమై మాట్లాడారు. మండలంలోని కడివెళ్ల గ్రామంలో – 2, గుడికల్ గ్రామంలో – 2 నాన్ రెసిడెన్సియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు సీఆర్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో సెంటర్‌లో 10 మంది వరకు డ్రాపవుట్ పిల్లలను చేర్పించాలని సూచించారు. అనంతరం కడివెళ్ల గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మారుతి, సీఆర్పీ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మెరుగైన ఫలితం

ఏకాగ్రతతో చదివితే పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమగ్రశిక్ష ఏపీసీ వేణుగోపాల్ సూచించారు. నైట్‌విజన్‌లో భాగంగా బుధవారం రాత్రి కడివెళ్ల గ్రామంలో పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. కళ్యాణి అనే విద్యార్థినితో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలంటే భయంవీడి ఏకాగ్రతతో చదవాలని సూచించారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మారుతి, ఏఎల్ఎస్‌ఓ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, సీఆర్పీ రంగన్న పాల్గొన్నారు.

నేడు మారెమ్మవ్వ దేవర



గద్దెరాళ్ల మారెమ్మవ్వ ఉత్సవమూర్తులు

ఆలూరు: దేవనకొండ మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో కొలువుదీరిన మారెమ్మవ్వ దేవర ఉత్సవాల సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తెల్లవారుజామున జరగనున్న బోనాలు కార్యక్రమానికి వేలాది సంఖ్యలో తరలివచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం, ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అలాగే తహసీల్దార్ సదర్శనం, ఎంపీడీఓ గౌరీదేవి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్ఐ భూపాలుడు వెల్లడించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



ఎండలో పనిచేస్తున్న కూలీలు (ఫైల్)

హొళగుంద: ఎండాకాలం మొదలు కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని హొళగుంద ప్రాథమిక ఆరోగ కేంద్రం వైద్యాధికారి న్యూటన్ తెలిపారు. వేసవిలో ఎండలు అధికంగా ఉంటాయని, కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మధ్యాహ్న వేళల్లో బయట తిరగడం తగ్గించాలన్నారు. వేసవి కాలంలో తెల్లటి నూలు లేదా లేత రంగు వస్త్రాలు ధరించాలని, జీన్స్ లాంటి బిగుతు వస్త్రాలు, మందం దుస్తులు వాడరాదని సూచించారు. పలుచటి వదులైన వస్త్రాలనే ధరించాలన్నారు.

వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలు

- ఎండలో అధికంగా తిరగడం, మద్యం, మాంసం, రంగుల పానీయలు తీసుకోవడం, గుట్కాలు నమలడం చేసే వారితో పాటు పొలాల్లో పని చేసే వారికి ఎక్కువగా వడదెబ్బ తగులుతుంది. ప్రధానంగా వృద్ధులు, చిన్న పిల్లలు త్వరగా వడదెబ్బకు గురౌతారు.
- అలసట, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం, వాంతులు, విరేచనాలు, కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం, 105 డిగ్రీలకన్నా జ్వరం ఎక్కువ ఉండడం, మూత్రం రంగు మారడం వడదెబ్బ ప్రధాన లక్షణాలు. ముందుగా తలనొప్పితో పాటు గొంతు తడారుతూ వస్తుంది. అప్పుడే అప్రమత్తమై నీడలోకి చేరి శరీరంలోని వేడిని తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మధ్యాహ్న వేళలో ఎండలో ఎక్కువగా తిరగరాదు. మద్యం సేవించడం మంచిది కాదు. మాంసాహారం తగ్గించి కాయగూరలు తినాలి. కొబ్బరి నీళ్లు, పళ్ల రసం తాగాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలి. భోజనం మితంగా తినాలి. నీడలోనే ఉంటూ పనులు చేసుకోవడం మంచిది.
- వడదెబ్బ తగిలిన వారిని చల్లటి ప్రాంతంలోకి తీసుకెళ్లాలి. పది నిమిషాల తరువాత కూలర్, ఏసీ ఉన్న గదుల్లో ఉంచాలి. షర్ట్ తీసివేసి చల్లని నీటితో తడిపిన బట్టతో ఒళ్లు తుడవాలి.
- కొబ్బరి నీళ్లు గానీ చక్కెర, చిటికెడు ఉప్పుతో తయారు చేసిన ద్రవాన్ని తాగించాలి. అపస్మారక స్థితిలో ఉన్న వారికి నీళ్లు తాగించకూడదు. వీలైనంత త్వరగా అక్కడి నుంచి ఆసుపత్రులకు తరలించాలి.
- వడదెబ్బ తగిలిన వారికి వెంటనే వైద్య చికిత్సలు చేయకపోతే ప్రాణహాని కలిగే అవకాశం ఉంది.

గ్రామ సచివాలయాల తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చూసే బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ బంగారమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటేకల్, దేవబెట్ట గ్రామాల్లో సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో సిబ్బందితో మాట్లాడుతూ.. తమ సమస్యలపై సచివాలయాలకు వచ్చే వారి పట్ల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే కారణాలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని ఆదేశించారు.

17న విగ్రహ ప్రతిష్ఠ

వెల్దుర్తి: మండల పరిధిలోని సూదేపల్లెలో భీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 17న చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 15వ తేదీ బుధవారం నుంచి గణపతి పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఆయా రోజులలో నందికోల సేవ, కోలన్నలు, 16న రాత్రి పంచమాంకములు నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

21 నుంచి కబడ్డీ పోటీలు

తుగ్గలి: ఉగాది పండుగ పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు కడమకుంట్లలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గౌరవ సలహాదారు సుల్తాన్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన జట్లకు వరుసగా సయ్యద్ సుల్తాన్ రూ.20 వేలు, షేక్ చిట్టి మస్తాన్ రూ.15 వేలు, కొండ వెంకటరాముడు, లంకాయపల్లి సురేష్, రూ.10 వేలు, అంగడి చిన్నబాషా రూ.5 వేలు నగదు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు7780248219, 9100549910 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రహదారి ఏర్పాటు

కృష్ణగిరి: గ్రామంలోని నందార్ల శ్మశాన వాటికకు రహదారి బాగాలేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి బాగు చేయించేందుకు పూనుకున్నారు. మంగళవారం జేసీబీతో ఆ దారిలో ఉండే కాలువలో సిమెంట్ పైప్ వేసి రహదారి ఏర్పాటు చేయించాడు. ఇదివరకే గుంతలు గుంతలుగా ఉన్న గ్రామంలోని మట్టి రహదారులను బాగు చేయించిన ఆయన గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

ఆర్బీకే వద్ద మందుబాబుల ఆగడాలు

హొళగుంద: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఉన్న ఆర్బీకే ముందు మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రాత్రి వేళ మద్యం తాగి ఖాళీ సీసాలను పగులగొట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీనివల్ల ఉదయం కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు గాజు పెంకులను తొక్కి గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో మద్యం సేవించకుండా మందుబాబులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.



ఇస్తెమా స్థలాన్ని సందర్శించిన ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, ముస్లిం పెద్దలు

ఇస్తెమాకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ రోడ్డులోని హరూన్ వెంచర్‌లో బుధవారం ముఖామి జమియతే అహెలేహదీస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ధార్మిక సభ (ఇస్తెమా) జరగనుంది. వేల సంఖ్యలో ముస్లింలు హాజరుకానున్నారు. సభకు వచ్చే వారికోసం అన్ని సౌకర్యాలు కల్పించినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సభా స్థలాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. ముస్లిం పెద్దలతో కలిసి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముస్లిం పెద్దలు ఎర్రకోట జగన్‌ను శాలువా కప్పి సన్మానించారు. షేక్ ఫజులుర్రహ్మాన్ ఉమరి అధ్యక్షతన జరిగే సభలో బెంగళూరు, హైదరాబాద్, బళ్లారి, రాయదుర్గం, కర్నూలుకు చెందిన మత పెద్దలు అబ్దుల్ బాసిత్ రియాజీ, జలాలుద్దీన్ ఖాస్మి, అబు రిజ్వాన్ మొహమ్మది, అబు హమ్‌దాన్ అష్రాఫ్ ఫైజీ తదితరులు దైవ ప్రవచనాలు చేయనున్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామీయా మసీద్ ప్రెసిడెంట్ ఖాశీంబేగ్ తదితరులు ఉన్నారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టండి



కృష్ణగిరి ఐకేపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

కృష్ణగిరి: పొదుపు సంఘాల ద్వారా ఇచ్చిన స్త్రీనిధి, ఉన్నతి రుణాలను రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. సమయానికి కార్యాలయానికి చేరుకోని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో స్త్రీనిధి కింద దాదాపుగా రూ.80లక్షలకుపైగా రుణాలు ఇచ్చారని వీటి రికవరీలో మాత్రం వెనుకబడ్డారన్నారు. దాదాపు రూ.50 లక్షల వరకు రికవరీ చేయాల్సి ఉందని, ఈ నెల చివరికల్లా వంద శాతం రికవరీ చేయకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రుణాలు రికవరీ చేస్తేనే మరింత మందికి రుణాలు ఇచ్చేందుకు వీలుంటుందన్నారు. అలాగే ఉన్నతి పథకం, ఎస్సీ, ఎస్టీ మహిళలకు జీవనోపాధి కోసం వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామని వీటి వాయిదాలు క్రమంతప్పకుండా చెల్లిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం దాసన్న, సీసీలు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై శ్రద్ధ వహించాలి



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

నందవరం: పాడి రైతులు లేగ దూడల పెంపకంపై శ్రద్ధ వహించాలని పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మంగళవారం జొహరాపురం గ్రామంలో పాడిరైతులకు లేగదూడల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశుపోషణలో రాణిస్తున్న రైతులకు ఉచితంగా మందులు, ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి మూడు నెలల పాటు లేగదూడలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పశువులకు లింగ నిర్ధారణ చూడి సూదులు వేయించడం ద్వారా 90 శాతం పెయ్య దూడలు పొందవచ్చని వివరించారు. దేశీయ పశువులు ఇచ్చే పాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేయించాలని, ముర్రు పాలు తాపించాలన్నారు. పశువులో గర్భం ఆరోగ్యంగా ఉండాలంటే 3 నెలలకు ఒక్కసారి మొలకెత్తిన విత్తనాలను తినిపించాలని ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర రెడ్డి సూచించారు. ఎమ్మిగనూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సుబ్రమణ్యం ఆచారి, కోసిగి సహాయ సంచాలకులు డాక్టర్ నారాయణ స్వామి, పశు వైద్యులు బన్ని హేమంత్‌కుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, ఉషారాణి, గిరిప్రసాద్, జూనియర్ పశు వైద్య సహాయకులు, గోపాల మిత్ర సభ్యులు నల్లారెడ్డి, ఈరన్న, రైతులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కృష్ణగిరి మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి

మద్దికెర: ఇంటర్ విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని చీఫ్ సూపరింటెండెంట్ సవిత, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ అంకమరావు స్పష్టం చేశారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు మొదలవుతాయన్నారు. మద్దికెర కేంద్రంలో మొత్తం 472 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 226 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 246 మంది ఉన్నట్లు వివరించారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 9 గంటలకు పరీక్ష మొదలవుతుందన్నారు. మొబైల్స్‌కు అనుమతి లేదని, కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తారని హెచ్చరించారు. 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం అనంతరం 1:05 గంటలకు స్కూలు ప్రారంభమవుతుందన్నారు.

కృష్ణగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ విశేశ్వరయ్య, ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ పురుషోత్తం, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి పరీక్షా కేంద్రం గదులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఈయేడాది మోడల్ స్కూల్ విద్యార్థులతోపాటు కంబాలపాడు గురుకుల బాలికల పాఠశాల, కస్తూర్బా విద్యాలయలం, జి.పుల్లారెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలకు సంబంధించి ఫస్టియర్‌లో 253 మంది, సెకండియర్‌కు సంబంధించి 193 మంది విద్యార్థులు ఈ సెంటర్‌లో పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు.

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌లో జూనియర్ కాలేజీ, ఎస్సీ గురుకులం, కేవీఆర్ ప్రైవేట్ కాలేజీలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 176 మంది, సెకండియర్ విద్యార్థులు 220 మంది పరీక్షలు రాయనున్నట్లు సెంటర్ చీఫ్ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ చంద్రకాంత్ తెలిపారు. కేంద్రం చుట్టుప్రక్కల 144 సెక్షన్ అమలు, పోలీసుల బందోబస్తు, జిరాక్స్ సెంటర్ల మూసివేత, ఆరోగ్య సేవల అందుబాటు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మొబైల్ ఫ్రీజోన్ మధ్య బోర్డు నిబంధనల మేరకు పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు గమనించి సహకరించాలని వారు కోరారు.

17న గోపుర కలశ ప్రతిష్ఠోత్సవాలు



టి.చాకిబండ ఆంజనేయస్వామి ఆలయం

ఆలూరు: హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామంలో ప్రఖ్యాతిగాంచిన ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 17న గోపుర కలశ ప్రతిష్ఠాపన, ముఖ ద్వారా కలశ ప్రతిష్ఠ, గ్రామ శిల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ప్రముఖ పంచాంగ పఠనకర్త, వేద పండితులు బెల్దోణ రామనాథ్ శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగపూజ, గుణపతి హోమం, పుణ్యాహవాచనం మన్యు సూక్త హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. 18వ తేదీన జరిగే మన్యుసూక్త హోమం, పూర్ణహుతి, రుద్ర హోమం కార్యక్రమాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా మోకా రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, నియోజకవర్గ నాయకులు హాజరు కానున్నట్లు సర్పంచ్ ఓబులపతి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ శివ

గాయపడిన స్కూటరిస్టు కిష్టప్ప

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన శివ ఆటోలో బంధువులను కప్పట్రాళ్ల వద్ద వదలి తిరిగి ఎమ్మిగనూరు నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. రాళ్లదొడ్డి సమీపంలో కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న హేమంత్‌కుమార్ అనే బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

- అలాగే సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సు మోటార్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో కడిమెట్ల గ్రామానికి చెందిన కిష్టప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతని కాలు విరిగింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదంపై విచారణ చేపట్టారు.

వలసలు నివారించేలా ఉపాధి పనులు



నార్లాపురం పరిధిలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని కూలీలకు ఉపాధి పనులతో ఊరట లభిస్తుందని, వలసల నివారణ సాధ్యమౌతుందని, వీలైనంత ఎక్కువ మందికి ఎక్కువ పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం పరిధిలో రూ.7.25 లక్షల అంచనాతో చేపట్టిన చెక్‌డ్యాం పూడికతీత పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ తెల్లవారుజామునే పనికి వచ్చి నాలుగు గంటలపాటు పనులు చేసుకుని వెళ్లాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున కూలీలకు 100 పనిదినాలు పూర్తయ్యేలా, ప్రతి రోజు వేతనం రూ.250 కు తగ్గకుండా ఉండేలా చూసుకోవాలని ఏపీఓ రాజునాయక్‌ను ఆదేశించారు. టీఏ శ్రీనివాసరావ్, ఎఫ్ఏ రాజేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్ది దుర్మరణం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె రోడ్డులోని ఎస్ఎస్ గార్డెన్ ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొణిదెల గ్రామానికి చెందిన తోడేలు మల్లికార్జున (30), పులి వెంకటేశ్వర్లు (28) ఇద్దరు మృతి చెందారు. కొణిదెల గ్రామానికి చెందిన పాండు కుమారుడు మల్లికార్జున బట్టల షాపులో గుమస్తాగా పనిచేసేవాడు. అదే గ్రామానికి చెందిన పెండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరివురు వరుసకు బావాబామ్మర్దులు. వీరు బంధువులు వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తుండడంతో హాజరయ్యారు. అనంతరం కొణిదెలకు తిరిగి వెళ్తుండగా ఐషర్ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన వీరివురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. తోడేలు మల్లికార్జునకు భార్య, కుమారుడు ఉన్నారు. పులి వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న కర్నూలు అర్బన్ తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ



ఎమ్మిగనూరులో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది



పగిడిరాయిలో మాత్ర వేస్తున్న వైద్యాధికారిణి హరిత

చిప్పగిరి: మండల కేంద్రంతో పాటు రామదుర్గం, బంటజాహాలు, గుమ్మనూరు తదితర గ్రామాలలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి పార్వతమ్మ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



చిప్పగిరి కస్తూర్బా పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి పార్వతమ్మ

గోనెగండ్ల: విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ రవళి సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య సిబ్బంది, హెచ్‌ఎం నాగభూషణంతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ రవళి మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు హనుమంతు, వేణుగోపాల్, పరమేష్, శాంతమ్మ, ఏఎన్‌ఎం లక్ష్మీ నరసమ్మ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులు, చిన్నారులకు మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.పీహెచ్‌సీ వైద్యురాలు సౌజన్యలత మాట్లాడుతూ.. నులిపురుగులతో పిల్లలకు రక్తహీనత, బరువు తగ్గడం, మానసిక ఎదుగుదల వంటి లోపాలు ఉత్పన్నమౌతాయన్నారు. మండలంలోని 1 నుంచి 19 ఏళ్లలోపు వారు 13,020 మంది ఉన్నారని వారందరికీ మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. 1– 2 ఏళ్ల లోపు పిల్లలకు 400 మి.గ్రా మాత్ర సగం, 2 – 19 ఏళ్ల లోపు విద్యార్థులకు ఒక మాత్ర చొప్పున అందించినట్లు వెల్లడించారు.

ఆలూరు రూరల్: ఆలూరులోని అంగన్‌వాడీ కేంద్రం –3లో మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులకు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మండలంలోని మొత్తం 12,227 మంది పిల్లలకు మాత్రలు అందిస్తున్నామని, పాఠశాలకు హాజరుకాని పిల్లలకు 18వ తేదీన సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి మాత్రలు అందిస్తారన్నారు.

ఆస్పరి: మండలంలోని శంకరబండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డాక్టర్ రఘురామిరెడ్డి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలో 14 వేల మంది పిల్లలు ఉండగా ఇప్పటివరకు 12వేల మంది పిల్లలకు మాత్రలు అందజేశామని, మిగిలిన వారికి ఈనెల 18వ తేదీలోపు అందజేస్తామని ఆయన చెప్పారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హాలహర్వి ప్రాథమిక వైద్యశాల సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండోజల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మహబుబ్‌ష, వైద్యాధికారిణి పరిమళ పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆర్యోంగా ఉండాలని సూచించారు.

తుగ్గలి: పొట్టలో తిష్టవేసి పోషకాలను ఆరగిస్తూ ఆరోగ్యాన్ని హరించే నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యులు హరిత, మహ్మద్ మినాజ్ పాషా అన్నారు. మంగళవారం పగిడిరాయి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి న్యూటన్ ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనారోగ్యానికి కారణమయ్యే ఆహార పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.

కృష్ణగిరి: నులిపురుగులను నివారించడం ద్వారా పిల్ల ల్లో రక్తహీనత నియంత్రించవచ్చని వైద్యాధికారులు మహేశ్వరప్రసాద్, ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 49 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 13,565 మంది విద్యార్థులకు గాను మంగళవారం 13,022 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.